ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు



కుళాయిలకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

• స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన నీరు అందించడమే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గాజులకొల్లివలస, నిర్వాసిత కాలనీ గ్రామాల్లో రూ. 114 లక్షల వ్యయంతో ఇంటింటికీ ఏర్పాటు చేయనున్న మంచి నీటి కుళాయిల పథకానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంశధార, నాగావళి నదుల మధ్య నియోజకవర్గం ఉన్నా గ్రామాల్లో మంచినీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నార. ఈ సమస్యను అధిగమించేందుకు జలజీవన్ మిషన్ పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్టు పేర్కొన్నారు. ఈ పథకంలో భాగంగా రూ. 235 కోట్ల వ్యయంతో నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. కలుషిత నీటిని తాగడం వలన రోగాలు బారిన పడే అవకాశం ఉందని.. దీనికి స్వస్తిచెప్ప ఇంటింటికీ స్వచ్ఛమైన నీటిని సరఫరా చేస్తామన్నారు. గ్రామాల్లో రహదారులు, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. నీరు లేనిదే మానవునికి మనుగడ లేదని.. అలాంటి నీటిని వృథా చేయరాదన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి గ్రామస్థాయిలోనే ప్రజల వద్దకే పరిపాలన తీసుకువచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పి.పి.సూర్యనారాయణ, జేఈ చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శి సంతోష్, వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డేపల్లి శేఖర్, పేడాడ శ్యామ్, కామిరెడ్డి రమణ, గొంటి కృష్ణ, మానుకొండ వెంకటరమణ, తిర్లంగి రామారావు, ఎన్ని రామచంద్రరావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఇది రైతు ప్రభుత్వం



రైతులకు విత్తనాలు అందజేస్తున్న కృష్ణదాస్ తదితరులు

• ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: రాష్ట్రంలో నడుస్తున్నది రైతు ప్రభుత్వమని నరసన్నపేట ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నప్పటినుంచి రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. గడిచిన నాలుగేళ్లుగా రాష్ట్రంలో రైతాంగం సుభిక్షంగా ఉందని చెప్పారు. నరసన్నపేటలోని మార్కెట్‌యార్డు ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గం పరిధిలోని రైతులకు రాయితీపై వరి విత్తనాల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తనాల పంపిణీ నుంచి పండిన పంట కొనుగోలు వరకూ అన్నింటిలో ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. రైతు బాంధవుడిగా ముఖ్యమంత్రి పేరు తెచ్చుకున్నట్టు పేర్కొన్నారు. టీడీపీ కాలంలో రైతులు విత్తనాలు, ఎరువుల కోసం అనేక కష్టాలకు, నష్టాలకు ఎదుర్కొన్నారన్నారు. గడిచిన నాలుగేళ్లుగా రైతులు ఆనందంగా పంటలను పండిస్తున్నారని చెప్పారు. ప్రకృతి ఒక వైపు.. దేవుడు మరో వైపు చల్లని చూపులతో అన్నదాతను కాపాడుతున్నారన్నారు. రైతు భరోసా పేరుతో ఏటా రూ. 13,500 రైతులకు చెల్లిస్తున్నామని గుర్తు చేశారు. ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి రైతుల చెంతకే విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తూ వారికి అవసరమైన సూచనలు అందిస్తూ దేశంలోనే రైతు పక్షపాత ప్రభుత్వంగా ఏపీ సర్కార్‌కు పేరు వచ్చిందన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుల తీరుపై ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. రైతుల గురించి మాట్లాడే అర్హత వారికి లేదన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు వారిని పట్టించుకోకుండా వదిలేశారన్నారు. ఇచ్చిన హామీలు కూడా అమలు చేయకుండా తీవ్రంగా రైతులను మోసం చేసిందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో రైతులందరూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే అండగా ఉంటారని అన్నారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షుడు శిమ్మ నేతాజీ మాట్లాడుతూ.. రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివిధాలా అండగా ఉంటున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దుంపల భాస్కరరావు, సొసైటీ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, ఏడీ రవీంద్రభారతి, ఏఈలు కె.సునీత, చిరంజీవులు, పార్టీ నాయకులు పంగ భావాజీ నాయుడు, వాన గోవిందరావు, కనపల శేఖరరావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లాగే ఎరువులు, విత్తనాలు పంపిణీ

• శాసనసభాపతి సీతారాం



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న స్పీకర్ తమ్మినేని

పొందూరు: సంక్షేమ పథకాల్లాగే విత్తనాలు, ఎరువులను గ్రామాల్లోనే రైతులకు అందిస్తున్నామని శాసనసభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. తండ్యాం గ్రామంలో శుక్రవారం వరి విత్తనాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సబ్సిడీపై వరి, ఉచితంగా కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఖరీఫ్‌లో రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల వద్ద అందించాలని వ్యవసాయాధికారులకు సూచించారు. ఎరువులు, విత్తనాల కోసం గతంలో రైతులు పడిగాపులు కాసి పోలీసు లాఠీల దెబ్బతినేవారని గుర్తు చేశారు. భూముల రిజిస్ట్రేషన్లు గ్రామ సచివాలయాల్లోనే జరుగుతాయని చెప్పారు. ప్రభుత్వ సేవలన్నీ ఇంటి వద్దకే అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. 558 క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ ఏడీ వడ్డాది శ్రీనివాసరావు, ఏవో బెండి బాబ్జీలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, పార్టీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, ఏఎంసీ చైర్మన్ బాడాన సునీల్, నాయకులు వడగ మోహన్, మీసాల రమణ ఉన్నారు.

ముస్లింల నమాజ్‌కు స్థలం కేటాయింపు

• పట్టాను అందజేసిన స్పీకర్ తమ్మినేని



ముస్లిం కులపెద్దలకు పట్టాను అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలో ఏళ్ల తరబడి స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న ముస్లింలు నమాజ్ చేసుకునేందుకు స్థలం లేక నానా ఇక్కట్లు పడ్డారు. ఈ సమస్యను స్పీకర్ తమ్మినేని సీతారాం దృష్టికి కుల పెద్దలు తీసుకెళ్లారు. వారి కోరిక మేరకు స్పీకర్ చొరవతో నామజ్ చేసుకునేందుకు స్థలాన్ని కేటాయించారు. దీనికి సంబంధించి పట్టాను శుక్రవారం స్పీకర్ క్యాంపు కార్యాలయం వద్ద ముస్లిం కుల పెద్దలకు అందజేశారు. మెట్టక్కివలస సుగర్ ఫ్యాక్టరీ వద్ద గల ప్రాంతంలో కొంత స్థలాన్ని కేటాయించాలని ముస్లిం కుల పెద్దలు గతంలో తమ్మినేని దృష్టికి తీసుకువచ్చారు. ఆ మేరకు వినతి పత్రాన్ని సమర్పించారు. దీనికి స్పందించిన సభాపతి స్థల కేటాయింపునకు సంబంధించిన చర్యలు తీసుకోవాల్సిందిగా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మెట్టక్కివలస వద్ద జెండా ప్రాంతంలో అందుబాటులో ఉండే అదనపు స్థలాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించారు. స్థల కేటాయింపునకు సంబంధించిన పట్టాను కుల ప్రతినిధులకు స్పీకర్ అందజేశారు. ఈ సందర్భంగా తమ అభ్యర్థనను గుర్తిస్తూ, అడిగిన వెంటనే స్థలం మంజూరుకు చర్యలు చేపట్టిన స్పీకర్ తమ్మినేని సీతారాంకు ముస్లిం కుల ప్రతినిధులు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జె.కె.వెంకుబాబు, ముస్లిం కులపెద్దలు జిలానీ, జలీల్ భాయ్, అబ్బు, బుఖారీ,మక్బూల్, యాసిన్, మత గురువు ఆలీఅహ్మద్ పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని ప్రిన్సిపాల్ గురుగుబెల్లి వాసుదేవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి పదో తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన బాలికలు ఈ నెల 17 నుంచి 24వ తేదీలోగా దరఖాస్తులు నేరుగా కళాశాలకు అందజేయాలని సూచించారు. మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల బాలికల జూనియర్ కళాశాల నిబంధనల ప్రకారం సీట్లు కేటాయిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 98499 23779, 99858 15108 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

2,444 మందికి జేవీకే కిట్లు పంపిణీ

ఎల్.ఎన్.పేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 2,444 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ పూర్తయిందని ఎంఈవో ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. మండల విద్యా శాఖ కార్యాలయంలో శుక్రవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడారు. మండలానికి ఈ విద్యా సంవత్సరానికి గాను 2,518 జగనన్న విద్యా కానుక కిట్లు వచ్చాయన్నారు. ఇప్పటి వరకు 2,444 మందికి పంపిణీ పూర్తవ్వగా.. కొత్తగా పాఠశాలల్లో చేరే పిల్లల కోసం కొన్ని కిట్లు సిద్ధంగా ఉంచామన్నారు.

భూముల రీసర్వే పూర్తి

బూర్జ: మహాజనివారిపేటలో భూముల రీసర్వే పూర్తయినట్టు తహసీల్దార్ ఎస్.రమణారావు తెలిపారు. అలాగే సర్వే పూర్తయిన రైతుకు సంబంధించిన భూముల రిజిస్ట్రేషన్‌ను ఉప్పినివలస సచివాలయంలో శుక్రవారం పూర్తి చేశామన్నారు. మరో రెండు రిజిస్ట్రేషన్లు జరిగినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.రవీంద్రబాబు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

15 మంది రక్తదానం

పొందూరు: రక్తదానంతోనే ప్రాణాపాయస్థితిలో ఉన్న వారిని రక్షించుకోవచ్చునని పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.రామారావు అన్నారు. రక్తదాన వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు మొత్తం 15 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యుడు కె.శాంతారాం పాల్గొన్నారు.

43 మందికి నేత్ర పరీక్షలు

కొత్తూరు: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మెట్టూరు బిట్–3 ఆర్ఆర్ కాలనీలో నేత్ర వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. స్థానిక ఆప్తాలమిక్ ఆఫీసర్ జానకీరామయ్య పర్యవేక్షణలో 43 మంది అవ్వాతాలకు కంటి పరీక్షలు చేశారు. వీరిలో 13 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. వీరికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తామని జానకీరామయ్య తెలిపారు.

చిరుధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం

పాతపట్నం: చిరుధాన్యాను ఆహారంగా తీసుకోవడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధ్యమని సీపీఎఫ్ సంస్థ కార్యదర్శి సంతోష్ అన్నారు. మండలంలోని శోభ పంచాయతీ కొమ్మలగూడ గ్రామంలో సీపీఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో గిరిజన రైతులకు చిరుధాన్యాలను శుక్రవారం పంపిణీ చేశారు. చిరుధాన్యాలు తినడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉంటామన్నారు. రాగులు, సజ్జలు, కొర్రలు, గంటేలు, కందులు, మినుములు, పప్పుధాన్యాలను గిరిజనులకు అందించామన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు రామారావు, శాంతి, ప్రియ, సరస్వతి ఉన్నారు.

పశుబీమాపై రైతులకు అవగాహన



సారవకోట: సమావేశంలో మాట్లాడుతున్న జయరాజ్



పాతపట్నం: పశుబీమాపై అవగాహన కల్పిస్తున్న కరుణాకరరావు

సారవకోట: రైతులు పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్థకశాఖ డీడీ వి.జయరాజ్ సూచించారు. లక్ష్మీపురం గ్రామంలో పశుబీమాపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడి పశువులకు, గొర్రెలు, మేకలకు బీమా చేపడుతున్నామని.. సంబంధిత రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీమా చేసుకున్న రైతులకు సంకర జాతి ఆవు చనిపోతే రూ. 30 వేలు, నాటు ఆవులు చనిపోతే రూ. 15 వేలు బీమా వర్తిస్తోందన్నారు. అలాగే గొర్రెలు, మేకలు చనిపోయినా రూ. 6 వేలు వస్తుందన్నారు. పశు వైద్యులు కిశోర్, మాజీ సర్పంచ్ పొదిలాపు వేణు ఉన్నారు.

పాతపట్నం: పాడి రైతులు వైఎస్సార్ పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎం.కరుణాకరరావు అన్నారు. చాకిపల్లి గ్రామంలో పశుబీమాపై పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకం దారులకు అవగాహన కల్పించారు. పశువులు చనిపోతే రైతులు నష్టపోకుండా పశుబీమా అండగా ఉంటుందన్నారు. సంవత్సరానికి రూ.36, రెండు సంవత్సరాలకు రూ.54, మూడు సంవత్సరాలకు 75 రూపాయలు ప్రీమియంగా చెల్లించాలన్నారు. లబ్ధిదారుడు 20 శాతం ప్రీమియం చెల్లిస్తే ప్రభుత్వం 80 శాతం భరిస్తోందని వివరించారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేత



బూర్జ: కరుణాసాగర్‌ను సత్కరిస్తున్న నాయకులు



హిరమండలం: విద్యార్థులకు నగదు బహుమతి అందిస్తున్న ఉపాధ్యాయులు

బూర్జ: కొల్లివలసలోని డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యాలయంలో చదివి టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు పేరిట ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రోత్సాహకాలు అందజేసి సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇదే పాఠశాలలో ఇంటర్ ప్రథమ (ఎంపీసీ) చదివి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన కరుణాసాగర్‌ను ప్రత్యేకంగా అభినంది నగదుతోపాటు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నూక రామకృష్ణ, సచివాలయ కన్వీనర్ల కోఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు, కొల్లివలస, చీడివలస సర్పంచ్‌లు జీడి వేణు, బూరి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

ఓ.వి పేట ఉన్నత పాఠశాలలో చదివి అత్యధిక మార్కులు సంపాదించిన ముగ్గురు విద్యార్థులకు వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు ప్రోత్సాహకాలు అందజేశారు. 600కి 494 మార్కులు సంపాదించిన చీడివలస గ్రామానికి చెందిన కదారి హేమలతకు రూ.మూడు వేలు, కంట్లాం గ్రామానికి చెందిన రాగోలు రాధిక 486 మార్కులు సాధించడంతో రూ. రెండు వేలు, లచ్చయ్యపేటకు చెందిన పట్ట కిరణ్‌కు 483 మార్కులు రావడంతో రూ. వెయ్యి అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ, పాఠశాల చైర్మన్ ఈపి చిన్నారావు, హెచ్‌ఎం చింతాడ నారాయణస్వామి పాల్గొన్నారు.

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. పొన్నాడ ఢిల్లేశ్వరరావు, ఎం.సుహాసినిలకు రూ.3 వేలు, తేజేశ్వరరావుకు రూ.2 వేలు, శ్రీహర్షిణీకి రూ. వెయ్యి చొప్పున నగదు అందించారు. ఉపాధ్యాయ సిబ్బంది సమన్వయంతో పనిచేయడం ద్వారానే పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెరిగిందని హెచ్‌ఎం మణికుమార్ అన్నారు. ఉపాధ్యాయులు లక్ష్మి, అరుణ, కాంతి, రాజు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమం

• స్పీకర్ సీతారాం
• తండ్యాంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమాన్ని వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: గడప గడపకు సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. తండ్యాం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని వివరించి అందుకు సంబంధించిన బ్రోచర్లను అందజేశారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే సంబంధిత గ్రామ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. పథకాల కోసం ఎవరికి ఎటువంటి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో ప్రతి కుటుంబాన్ని కలిసే అవకాశం ప్రభుత్వం కల్పించడ ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, మండల పార్టీ కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, ఏఎంసీ చైర్మన్ బాడాన సునీల్, ఎంపీటీసీ సభ్యురాలు వడగ పార్వతి, వడగ మోహన్, మీసాల రమణ, వెలిచేటి రామచంద్రరావు, మన్నె వెంకటరావు ఉన్నారు.

జగనన్న పాలన సంక్షేమానికి చిరునామా

• ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మహిళలకు సంక్షేమాన్ని తెలియజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సంక్షేమానికి చిరునామాగా మారిందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పెద్దకోట గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాల వారు పొందిన ఆర్థిక ప్రయోజనాలను తెలియజేశారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు మంజూరు చేసి వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకు అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, నవరత్నాల పథకాలను నాలుగేళ్లుగా ఎలాంటి ఇబ్బంది లేకుండా ముఖ్యమంత్రి అమలు చేశారని కొనియాడారు. అన్నివర్గాల వారి సంక్షేమం కోసం నవరత్నాల పథకాలు అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు అందరూ అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పెనుమజ్జి విష్ణుమూర్తి, ఎంపీడీవో ఆర్.కాళీప్రసాద్, సర్పంచ్ ముగడ దివాకర్, పార్టీ నాయకులు ముగడ జనార్దన, లోచర్ల మల్లేశ్వరావు, ఈగల చిన్నారావు, తొత్తడి మురళీ, బలగ గోవిందరావు పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ



జలుమూరు: ఎరువులు పంపిణీ చేస్తున్న దృశ్యం



బూర్జ: ఎరువులు అందజేస్తున్న నాయకులు



కొత్తూరు: విత్తనాలు అందజేస్తున్న నాయకులు

జలుమూరు: లింగాలవలసలో రైతులకు విత్తనాలు, ఎరువులు రాయితీపై శుక్రవారం అందజేశారు. వ్యవసాయ మండలి అధ్యక్షుడు బుక్కా లక్ష్మణరావు వీటిని పంపిణీ చేశారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

బూర్జ: పెద్దపేట సచివాలయం పరిధి రైతు భరోసా కేంద్రంలోని రైతులకు విత్తనాలు, ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ డైరెక్టర్ వావిలపల్లి గోవిందరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చిన విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ డి.వి. నాయుడు, అగ్రికల్చర్ అసిస్టెంటు వియ్యపు జగదీష్, వలంటీర్లు పాల్గొన్నారు.

కొత్తూరు: కర్లెమ్మ ఆర్బీకే పరిధిలోని రైతులకు రాయితీ వరి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు లోతుగెడ్డ తిరుపతిరావు మాట్లాడుతూ.. అన్నదాత సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భగవాన్ దాసు నాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు వి.గౌరీ, కర్లెమ్మ గ్రామ వ్యవసాయ సహాయకురాలు లక్ష్మీకల్యాణి, నాయకులు వై.హరిదాసు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'జగనన్నకు చెబుదాం' సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాజగోపాలరావు

జలుమూరు: జగనన్నకు చెబుదాం విభాగానికి వస్తున్న సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి రాజగోపాలరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. రెవెన్యూ, మండల పరిషత్, వ్యవసాయం, వైద్యం, విద్య తదితర శాఖలపై చర్చించారు. సమావేశంలో ఎంపీడీవో ఐవీ అప్పారావు, డీటీ శ్రీనివాసరావు, వైద్యులు తాడేల శ్రీకాంత్, ఎంఈవో మాధవరావు ఉన్నారు.

లక్ష్యాలను పూర్తి చేయండి

• డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్



సమీక్షలో పీడీ విద్యాసాగర్ తదితరులు

నరసన్నపేట: నిర్దేశించిన లక్ష్యాలను గ్రామస్థాయిలో సీసీలు, సీఎఫ్‌లు, మండల కేంద్రాల్లో వెలుగు సిబ్బంది పూర్తి చేయాలని డీఆర్‌డీఏ పీడీ డీవీవీ విద్యాసాగర్ అన్నారు. నరసన్నపేటలోని వెలుగు కార్యాలయంలో నరసన్నపేట, గార, జలుమూరు, పోలాకి, శ్రీకాకుళం రూరల్ మండలాలకు సంబంధించిన సిబ్బందితో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. బ్యాంకు లింకేజీలు, వైఎస్సార్ బీమాతో పాటు పలు పథకాల అమలుపై సమీక్ష చేపట్టారు. సంఘాలు, రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. సమావేశంలో ఎంపీడీవో మధుసూదనరావు, ఏసీ కొండలరావు, ఏపీఎం సాయిలక్ష్మి, హేమసుందరరావు, అప్పలరామయ్య పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్యాన్లు వితరణ



హెచ్‌ఎంకు మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: చినకాగితాపల్లి పంచాయతీ వీరభద్రాపురం ప్రాథమిక పాఠశాలకు స్థానిక సర్పంచ్ మూనకాల అన్నపూర్ణమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సూర్యారావు దంపతులు రూ. పది వేల విలువైన సామగ్రిని వితరణగా శుక్రవారం అందజేశారు. ఫ్యాను, క్రీడా పరికరాలు, విద్యుత్ వైరింగ్ మెటీరియల్‌ను ప్రధానోపాధ్యాయుడు కూన రమణబాబుకు అందించారు.

వరుణ్ చక్రవర్తికి అభినందనల వెల్లువ



వరుణ్ చక్రవర్తిని అభినందిస్తున్న దృశ్యం

పోలాకి: నీట్ ఆలిండియా టాపర్ బోర వరుణ్ చక్రవర్తికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. తోటాడలోని ఆయన స్వగ్రామానికి వివిధ సంఘాల నాయకులు, అధికారులు, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం వెళ్లి అభినందనలు తెలియజేశారు. భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి ఎదిగి జిల్లా యువతకు స్ఫూర్తి కావాలని ఆకాంక్షించారు. వరుణ్ చక్రవర్తిని అభినందించిన వారిలో నరసన్నపేట లయన్స్ క్లబ్ సభ్యులు, రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ, ప్రముఖ వైద్యుడు బలగ మురళీమోహన్ తదితరులున్నారు.

ఆసరా చెల్లింపులు పూర్తి చేయాలి

ఎల్.ఎన్.పేట: డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ ఆసరా నగదు చెల్లింపులు పూర్తి చేయాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎస్.రవిరాజ్ బ్యాంకర్లను కోరారు. మండల కేంద్రంలోని ఏపీ జీవీబీ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మండలంలోని 80 శాతం స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళల వ్యక్తిగత ఖాతాలకు చెల్లింపులు జరిగాయని 20 శాతం సంఘాలకు ఇంకా చెల్లింపులు జరగాల్సి ఉందన్నారు. వారికి కూడా తక్షణమే చెల్లింపులు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ రుణాల చెల్లింపులు జరుగుతున్నందున కాస్త జాప్యం జరిగిందని పది రోజుల్లో పూర్తి చెల్లింపులు చేస్తామని బ్యాంకు సిబ్బంది తెలిపారు. వైకేపీ సీసీ పుణ్యవతి, విజయ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల అందజేత

హిరమండలం: హిరమండలం, నవగూడ, జగన్నాథపురం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను శుక్రవారం పంపిణీ చేశారు. సరుబుజ్జిలి మండలం కాగితాపల్లి సచివాలయంలో మహిళా పోలీస్‌గా పని చేస్తున్న వంజరాపు భాగ్యలక్ష్మి వీటిని వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యతోనే కుటుంబ పరిస్థితులు మారుతాయన్నారు.హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.